టీజీవో జిల్లా కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

ఎం కాళీచరణ్‌గౌడ్

ఏ అరవిందర్‌రెడ్డి

కొత్తపల్లి, నవంబర్ 28 : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ (టీజీవో) కరీంనగర్ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష కార్యదర్శులుగా మడిపల్లి కాళీచరణ్‌గౌడ్, ఏ అరవిందర్‌రెడ్డి, కోశాధికారిగా నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో ఫంక్షన్‌హాల్‌లో గురువారం టీజీవో జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్లు కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, కార్యదర్శి సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా కార్యవర్గ సమావేశం అనంతరం ఎన్నికలను నిర్వహించగా, కాళీచరణ్, అరవిందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అధికారి జగన్మోహన్‌రావు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వ పెద్దలపై ఉందన్నారు. అదేవిధంగా సీపీఎస్ లాంటి గుదిబండను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. అదే విధంగా ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలన్నారు. హెల్త్ కార్డులపై ప్రభుత్వం చొరవ తీసుకొని ఇబ్బందులను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, టీజీవో మాజీ జిల్లా అధ్యక్షుడు ఏ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రామకృష్ణగౌడ్, శ్యామ్, పరమేశ్వర్‌రెడ్డి, రవికుమార్, మామిడి రమేశ్, లింగారెడ్డి, విష్ణువర్ధన్, లక్ష్మీనర్సింహారావు, గడ్డం సుధాకర్, రాగి శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ హర్మేందర్‌సింగ్, రాజేశ్ భరద్వాజ్, కరుణాకర్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామస్వామి, కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గొట్టె భూపతి కుటుంబానికి పరామర్శ

గొట్టె భూపతిని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్

ముకరంపుర, నవంబర్ 28 : మాజీ ఎంపీ గొట్టె భూపతి సతీమణి గొట్టె శాంత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ కెప్టెన్ వీ లక్ష్మీకాంతారావు, మాజీ శాసనసభ్యుడు వొడితల సతీశ్ కుమార్ గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. శాంత చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. కుమారుడు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, సృజన్‌ను ఓదార్చారు. వారి వెంట జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ పేరాల గోపాలరావు, కట్టంగూరి రామచంద్రారెడ్డి తదితరులున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వనభోజనాలు

తెలంగాణచౌక్, నవంబర్ 28 : ఆర్టీసీ ఎండీ, వైస్ చైర్మన్ ఆదేశాల మేరకు కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో గురువారం డిపో-2లో డీఎం మల్లయ్య ఆధ్వర్యంలో రెండు డిపోల ఉద్యోగులకు వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీవితభాగస్వాములతో పాల్గొన్నున్న ఉద్యోగులు ఆటపాటలతో సరదాగా గడపారు. అనంతరం భోజనాలు చేశారు. ఆర్ఎం సుచరిత మాట్లాడుతూ, ఇలాంటి ఉల్లాస భరిత కార్యక్రమాలతో ఉద్యోగుల పని ఒత్తిడి నుంచి ఉపసమనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి డీఎం విజయమాధురి, డిపో సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, వీరస్వామి పాల్గొన్నారు.

మిడ్‌డే మీల్స్ తనిఖీ చేసిన ఎంఈవో

రామడుగు, నవంబర్28 : కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఈవో అంబటి వేణుకుమార్ గురువారం గుండి, గోపాల్‌రావుపేట, వెంకట్రావుపల్లి గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతూ భోజనం ఏర్పాటులో తప్పనిసరిగా నాణ్యతతో పాటు పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

రౌడీషీటర్లపై నిఘా పెట్టాలి

- సీపీ అభిషేక్ మహంతి
- కేశవపట్నం పోలీస్‌స్టేషన్ తనిఖీ

కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

శంకరపట్నం, నవంబర్ 28 : వీధి రౌడీలుగా చలామణి అవుతూ గ్రూపులుగా ఏర్పడి శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై రౌడీ షీట్లు తెరవాలని సీపీ అభిషేక్ మహంతి ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా గురువారం సీపీ కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడారు. పలు సందర్భాల్లో పట్టుబడి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న వాహనాలపై వాకబు చేసి, వాటిని తొలగించాలని ఆదేశించారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్షించారు. పాత నేరస్తులపై తరచుగా నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై దృష్టి పెట్టాలన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ప్రజల్లో సైబర్‌నేరాలపై అవగాహన కలించాలన్నారు. ప్రధాన రహదారిపై బ్లాక్ స్పాట్‌ను గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, ఇసుక, రేషన్ బియ్యం అక్ర మ రవాణా, ఏకాట ఆడే వారిపై ఉక్కు పాదం మోపా లన్నారు. హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్, ఎస్ఐ రవి, ఏఎస్ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాలపై నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

చొప్పదండి, నవంబర్ 28 : రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ హాస్టల్ గురుకులాలపై నిర్లక్ష్యం చేస్తోందని ఫుడ్ పాయిజన్ అవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ విమర్శించారు. గురువారం పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గురుకుల హాస్టల్‌లో 49 మంది విద్యార్థులు చనిపోతే ఇప్పటివరకు స్పందించకపోవడం దారుణమన్నారు. రాకేశ్, విష్ణు, శ్రీనివాస్, అనిల్, చరణ్, సంజయ్, హరీశ్, సాత్విక్, అజిత్, వాసు విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు బస్సులు ఢీ.. ప్రయాణికులకు గాయాలు

గాయపడ్డ ప్రయాణికులను అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం

తిమ్మాపూర్, నవంబర్28 : మండలంలోని అల్గునూర్ వద్ద మానేరు వంతెనపై రెండు ఆర్టీసీ బస్సులు ఢీ కొన్నాయి. దీంతో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ డిపో1కు చెందిన రెండు బస్సులు గురువారం సాయత్రం ప్రయాణికులను తీసుకొని జమ్మికుంట, కోహెడ వైపు వెళ్తున్నాయి. ఈ క్రమంలో మానేరు వంతెన దిగిన తర్వాత చౌరస్తాలో జమ్మికుంట బస్సు టికెట్లు తీసుకునేందుకు డ్రైవర్ నిలిపాడు. అదే సమయంలో వెనుక వస్తున్న ఇందుర్తి-కోహెడ వెళ్తున్న బస్సు అదుపుతప్పి జమ్మికుంట బస్సును ఢీ కొట్టింది. దీంతో రెండు బస్సుల్లోని పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదంతో వంతెనపై పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎల్ఎండీ, కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో కరీంనగర్ దవాఖానకు తరలించారు.

నలుగురు శిశువుల దత్తత

కలెక్టరేట్, నవంబర్ 28 : నగరంలోని శిశుగృహలో పెరుగుతున్న నలుగురు శిశువులను పిల్లలు లేని నాలుగు జంటలకు అధికారులు దత్తత ఇచ్చారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఇద్దరు మగ, ఇద్దరు ఆడ శిశువులను కలెక్టర్ చేతుల మీదుగా దంపతులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చట్టబద్ధమైన దత్తత మాత్రమే తీసుకోవాలన్నారు. పిల్లలు లేని దంపతులు దత్తత కోసం జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. రక్తసంబంధీకుల నుంచి చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలనుకునే వారు కూడా ఈ శాఖలో పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో ఎం సరస్వతి, డీసీపీవో పర్వీన్, పీవో తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్వి, ఔట్ రీచ్ వర్కర్ రమేశ్, సామాజిక కార్యకర్త రాజేశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం బాల్య వివాహ-ముక్త్ భారత్ వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 10 వరకు జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిరుప్రాయంలోనే వివాహాలు చేస్తే కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. బాల్య వివాహాల నిర్మూలన అధికారులుగా కొనసాగుతున్న ఆర్డీవో, తహసీల్దార్లు, సీడీపీవోలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

మానకొండూర్, నవంబర్ 28: రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలనే డిమాండ్‌తో జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో డిసెంబర్ 1 హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'హలో మాల- ఛలో హైదరాబాద్' 'మాలల సంహగర్జన' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాల మహానాడు మండలాధ్యక్షుడు బొల్లం వెంకటస్వామి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో మాలల సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కాడె శంకర్, వెన్నె రాజమల్లయ్య, తడకపెల్లి నారాయణ, ఉండింటి మల్లేశం, రొడ్డ మహేందర్, నరేందర్, జలపతి, రవీందర్ పాల్గొన్నారు.

గ్రామ దేవత విగ్రహ ప్రతిష్ఠ

మానకొండూర్ రూరల్, నవంబర్ 28 : మండలం లలితాపూర్‌లో గురువారం గ్రామ దేవతలైన శ్రీ భూలక్ష్మి, మహాలక్ష్మి సహిత నాభిశల (బొడ్రాయి)లతో పాటుగా పోచమ్మ విగ్రహాలను మాజీ సర్పంచ్ కొండయ్య, మానకొండూర్ ఏంఎంసీ చైర్మన్ మర్రి ఓదెలుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం చేశారు. కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న మహిళలు

మానకొండూర్, నవంబర్ 28: మండలంలోని మానేరు పరివాహక గ్రామాల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం మండల కేంద్రంలోని పంచాయతీ సమీపంలో స్థానిక మహిళలు అడ్డుకొని ఆందోళన చేశారు. నిత్యం వందల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు కరీంనగర్ వైపు మీతిమిరిన వేగంతో వెళ్తుండడంతో పిల్లలు ఇండ్లలో నుంచి బయటికు వెళ్లాలంటే భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మితిమీరిన వేగంతో ఇసుక ట్రాక్టర్లు వెళ్తుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఇసుక ట్రాక్టర్లపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలని కోరారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

కార్పొరేషన్, నవంబర్ 28 : కరీంనగర్ నగరపాలక సంస్థలో పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న దాసరం మురళి ఆనారోగ్యంతో మృతి చెందారు. ఆరెపల్లిలో ఆయన నివాసం వద్ద నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సువార్త గురువారం భౌతికగాయానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కొన్నేళ్లుగా నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో మురళి కార్మికుడిగా (ట్రాక్టర్ డ్రైవర్) పని చేస్తున్నారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

చొప్పదండి, నవంబర్ 28 : జాతీయ నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన పట్టణంలోని సోషల్ వెల్ఫేర్‌లో చదువుతున్న విదార్థులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్‌లో ఉన్న మిగతా విద్యార్థులు కూడా రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు స్వరూప-శ్యాంకుమార్, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

టీబీ ఫ్రీ ఇండియా కార్యక్రమంపై జిల్లా, రాష్ట్ర అధికారులకు శిక్షణ

విద్యానగర్, నవంబర్ 28 : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో టీబీ ఫ్రీ ఇండియా కార్యక్రమంలో భాగంగా 100 రోజుల క్యాంపెయిన్‌పై రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అధికారులకు ఆన్‌లైన్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందస్తుగా అనుసరించాల్సిన విధానాలు, ఏర్పాట్లపై జిల్లా స్థాయి అధికారులకు సమాచారం, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కే వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, జిల్లా క్షయ నివారణ అధికారి, జిల్లా కోఆర్డినేటర్, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు భయపడం

జమ్మికుంట, నవంబర్28 : గురుకుల పాఠశాలల్లో జరుగుతున్న ఇబ్బందులను ప్రశ్నిస్తే సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు అక్రమ అరెస్టులు చేయిస్తున్నదని, అరెస్టులకు భయ పడేది లేదని టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు ఆవుల తిరుపతి యాదవ్ అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గురుకులంలో చదువుతున్న విద్యార్థులు మృత్యువాత పడుతుంటే బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లోని సంక్షేమ భవనాన్ని ముట్టడిస్తే అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. పోలీసు స్టేషన్లు మార్చుతూ భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని, పోలీసు సంకెళ్లు ఉద్యకారుడు శ్రీనివాస్ యాదవ్‌ను అడ్డుకోలేవన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతున్నదని, కాంగ్రెస్ పాలనపై రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతున్నామన్నారు. విద్యార్థుల పక్షాన నిలబడి కొట్లాడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులున్నారు.

సామాజిక తనిఖీపై అవగాహన

జమ్మికుంట, నవంబర్ 28: మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో భీమేశ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జమ్మికుంట మండలంలో 1.4.2023 నుంచి 31.3.2024 వరకు జరిగిన పనులపై 15వ విడుత సామాజిక తనిఖీపై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశానికి ఇన్‌చార్జి ఏపీవో లక్ష్మణ్, ఎస్పార్పీ సుశీల, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ త్వరలో జరుగబోయే 15వ విడుత సామాజిక తనిఖీ కోసం అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి కొయ్యలను దహనం చేయొద్దు

శంకరపట్నం, నవంబర్ 28: వరి కోతల అనంతరం వరి కొయ్యల దహనంతో మిత్ర పురుగులను కోల్పోతామని జిల్లా రైతు శిక్షణా కేంద్రం (ఎఫ్‌టీసీ) డీడీఏ చంద్రూనాయక్ సూచించారు. బుధవారం కరీంపేట్ గ్రామంలో రైతులకు భూసార పరీక్షా విధానాలు, ఆవశ్యకతలపై అవగాహన కల్పించారు. అలాగే వరి 'కొయ్యల దహనం-అనర్థాలు' అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మానకొండూర్ ఏడీఏ శ్రీధర్, ఏవో వెంకటేశ్, ఏఈవో ప్రవంతి, రైతులు పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన..

కరీంనగర్ రూరల్: నవంబర్ 28 : చేగుర్తిలో గ్రామంలోని నర్సరీ, పౌల్ట్రీ ఫారం పరిశీలించేందుకు వచ్చిన డీఆర్డీవో శ్రీధర్‌ను గ్రామ మాజీ ఎంపీటీసీ సరోజన, మల్లేశ్ యాదవ్ పుష్పగుచ్ఛంతో స్వాగతించారు. గురువారం మండలంలోని చేగుర్తిలో ప్రజాపాలన సందర్భంగా పనుల పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. స్థానికంగా జరుగుతున్న నర్సరీ పనులు, పౌల్ట్రీ పనులను, పశువుల షెడ్డు నిర్మాణాలను పరిశీలించారు. ఏపీవో శోభరాణి, పంచాయతీ కార్యదర్శి రాజమల్లె, ఫీల్డ్ అసిస్టెంట్ గాలిపెల్లి సుజాత, గ్రామ మహిళా సంఘ సభ్యులు, ఉపాధిహామీ కార్మికులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో అద్భుతాలు చేయొచ్చు

హుజూరాబాద్ రూరల్, నవంబర్ 28 : ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్ కోర్సుతో ఏ రంగంలో నైనా అద్భుతాలు చేయొచ్చని కిట్స్ డైరెక్టర్ శంకర్ అన్నారు. గురువారం మండలంలోని కిట్స్ కళాశాల సమావేశం మందిరంలో ఏఐ ఇన్ వెబ్ డెవలప్‌మెంట్ ఫ్రం ఆటోమేషన్ టూ ఇన్నోవేషన్ ఐదు రోజుల వర్స్ షాప్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ శంకర్ మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్‌లో ఎన్నో కొత్త రకాల టెక్నాలజీస్ వస్తున్నాయని, విద్యార్థులు వాటిపై అవగాహన ఏర్పరుచుకోవాలని సూచించాడు. సీఎస్సీ విభాగదిపతి మేజర్ రవీంద్ర బాబు, ఈ కార్యాశాల కోఆర్డినేటర్స్‌గా యాకూబ్, జీ దీపక్ వ్యవహరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి బ్రెనో విజన్ నుంచి వచ్చిన నిపుణులు ఓబులయ్య, శ్రావణ్య, స్ఫూర్తి, నారాయణస్వామి, సీనియర్ అధ్యాపకులు రఘు, పవన్, మమత, భారతి ఉన్నారు.

గ్రామాల్లో ఆరోగ్య శిబిరం

జమ్మికుంట, నవంబర్ 28: మండలంలోని మాచనపల్లి, పాపక్కపల్లి గ్రామాల్లో వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రజలు వైద్య పరీక్షలు చేశారు. జ్వర పీడితులకు మందులు అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్లు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తో పాటూ వ్యక్తిగత శుభ్రతను కూడా పాటించాలని సూచించారు. దోమల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్లు ఫర్హానుద్దీన్, రాజేశ్‌కుమార్, హెచ్ఈ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిపోటీలకు ఎంపిక

సైదాపూర్, నవంబర్28 : ఇటీవల జరిగిన జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలో ప్రతిభ చూపిన మండలంలోని ఆకునూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ -17 విభాగంలో సంజన, సాత్విక, రాహూల్‌లు రాష్ట్ర స్థాయికి ఎంపికకాగా వారిని హెచ్ఎం రామస్వామి అభినందించారు. ఈ నెల 30 నుంచి మంచిర్యాలలో జరిగే పోటీలకు వీరు వెల్లనున్నారు. పీడీ నిర్మల, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

చెకుముఖి పోటీల్లో..

చొప్పదండి, నవంబర్28: కరీంనగర్‌లో నిర్వహించిన చెకుముఖి సైన్స్ టాలెంట్ పోటీల్లో గెలుపొంది ఆర్నకొండ జడ్పీహెచ్ఎస్, రెసిడెన్షియల్ స్కూల్ విభాగంలో రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని మండల విద్యాధికారి శ్రీనివాస్ దీక్షిత్ గురువారం తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

సీపీ అభినందనలు..

గంగాధర, నవంబర్ 28: మహిళ పోగొట్టుకున్న బ్యాగును చాకచక్యంగా రికవరీ చేసి, తిరిగి అందజేసిన గంగాధర ఎస్ఐ, పోలీసులను సీపీ అభిషేక్ మహంతి శుక్రవారం అభినందించారు. మండలంలోని లక్ష్మీదేవిపల్లికి చెందిన హీనాపర్వీన్ బుధవారం సాయంత్రం తన తల్లితో కలిసి కరీంనగర్‌లో ఆటో ఎక్కి లక్ష్మీదేవిపల్లిలో దిగింది. కొద్ది సేపటి తర్వాత బ్యాగు కనిపించకపోవడంతో గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నరేందర్‌రెడ్డికి తెలిపింది. దీంతో పోలీసులు ఆటోను ట్రేస్ చేసి పట్టుకొని అందులో ఉన్న బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. బ్యాగులో 10 తులాల బంగారు నగలు, మొబైల్ ఫోన్ ఉండగా, బాధిత గంగాధర పోలీస్‌స్టేషన్‌లో బాధిత మహిళలకు అందజేశారు. గంటల వ్యవధిలోను మహిళ పోగొట్టుకున్న బ్యాగును తిరిగి అందజేసిన ఎస్ఐ నరేందర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్స్ రాజయ్య, కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ మానిక్యరెడ్డి, ఐటీసెల్ పీసీ ప్రదీప్‌కు రివార్డులు, ప్రశంసా పత్రాలను అందజేసి, సీపీ అభినందించారు.

30 నుంచి జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన

బాల వైజ్ఞానిక ప్రదర్శన వివరాలను వెల్లడిస్తున్న డీఈవో

కొత్తపల్లి, నవంబర్ 28 : ఈ నెల 30 నుంచి డిసెంబర్ 2 వరకు జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డ్ ప్రదర్శనలను కొత్త పల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు వెల్లడించారు. గురువారం సెయింట్ జార్జ్ పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల వైజ్ఞానిక ప్రదర్శనతో పాటు 2023-24 సంవత్సరానికి గాను ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైన 142 పాఠశాలలకు సంబంధించిన ప్రదర్శనలు వస్తాయన్నారు. ఈ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 'భావితరాలకు సుస్థిర సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే ప్రధాన అంశంతో పాటు ఆహారం -ఆరోగ్యం - పరిశుభ్రత, రవాణా, సమాచార వ్యవస్థ, సహజ వ్యవసాయం, విపత్తుల నిర్వహణ గణిత సమూహాలు, గణన ఆలోచనలు, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ అనే అంశాలపై జూనియర్, సీనియర్ విభాగాలుగా ప్రదర్శనలు ఉంటాయన్నారు. డీసీఈబీ సెక్రటరీ మారం స్వదేశ్ కుమార్, సైన్స్ ఆఫీసర్ చాడ జయపాల్ రెడ్డి, కొత్తపల్లి ఎంఈవో ఎండీ అబ్దుల్ అజీమ్, జీహెచ్ఎం భగవంతయ్య, కోఆర్డినేటర్ కేఎస్ అనంతాచార్య పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

గంగాధర, నవంబర్ 28 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల, మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మధ్యా హ్న భోజనాన్ని మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్‌రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడి మ ధ్యాహ్న భోజన వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి జ వాబులు రాబట్టారు. పాఠశాలల్లో రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధ్యాపకులకు సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామడుగు, నవంబర్28 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో బాలికల వసతిగృహంలో తాత్కాలిక పద్ధతిలో విధులు నిర్వర్తించేందుకు వాచ్‌వుమెన్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎంఈవో అంబటి వేణుకుమార్ తెలిపారు. అభ్యర్థులు స్థానిక మండలానికి చెందిన వారై ఉండాలన్నారు. కనీసం పదో తరగతి చదివి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్, బయోడెటాతో జత చేసి, డిసెంబర్ 2న సాయంత్రం 5 గంటల లోగా మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం(ఎమ్మార్సీ)లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దీక్షా దివస్‌కు తరలిరావ